నల్లాలు సరే.. నీళ్లేవి..?

- అలంకారప్రాయంగా మారిన మిషన్ భగీరథ కనెక్షన్లు
- నీరు రాక ఏళ్లుగా ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు


మద్నూర్‌లో వృథాగా ఉన్న మిషన్ భగీరథ నల్లాలు

మద్నూర్(జుక్కల్): గత ప్రభుత్వం తాగు నీరు అందిస్తామని ఇంటింటికి మిషన్ భగీరథ పైప్‌లైన్ ఏర్పాటు చేసి నల్లాలు బిగించినా నీరు మాత్రం రావడం లేదని ప్రజలు చెబుతున్నారు. మిషన్ భగీరథ కనెక్షన్లు ఇచ్చి ఏళ్లు గడుస్తున్నప్పటికి ఇంత వరకు తాగు నీరు రాకపోవడంతో అవి ఇళ్ల ముందర దిష్టిబొమ్మల్లాగా దర్శనమిస్తున్నాయని పలువురు అంటున్నారు. ఇంటింటికి శుద్ధ జలాలను అందించాలన్న సంకల్పంతో గత ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మిషన్ భగీరథ పథకం అభాసుపాలవుతోంది. మద్నూర్, డోంగ్లీ మండల కేంద్రాలతో పాటు మారుమూల గ్రామాల్లో కూడా భగీరథ నీరు రాకపోవడం, కొన్ని చోట్ల సన్నగా రావడంతో గంటకు ఒక బిందె కూడా నిండడం లేదని ప్రజలు చెబుతున్నారు. మిషన్ భగీరథ నీరు నేటి వరకు రావడం లేదంటే అతిశయోక్తి కాదు. గతంలో గ్రామ పంచాయతీ పైప్‌లైన్ ద్వారా నీరు సక్రమంగా వచ్చేది కానీ మిషన్ భగీరథ పైప్‌లైన్ వేశాక నీరు రావడమే లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మిషన్ భగీరథ నీరు రావడం లేదని అధికారుల దష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదని అంటున్నారు. ఇళ్ల ముందు అలంకారప్రాయంగా ట్యాప్‌లను మాత్రం అధికారులు ఏర్పాటు చేశారని నీరు మాత్రం రావడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తక్షణమే స్పందించి ఇళ్లకు మిషన్ భగీరథ నీరు అందేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

సమస్య పరిష్కరించాలి

మద్నూర్‌లో మిషన్ భగీరథ నీరు రావడం లేదు. నాలుగేళ్ల క్రితమే మిషన్ భగీరథ నీటి సరఫరా కోసం మా ఇంటి ముందు నల్లా ఏర్పాటు చేశారు. కాని అందులోంచి ఇంత వరకు శుద్ధ జలాలు రాలేదు. అధికారులు చర్యలు తీసుకొని నీటి సమస్యను తీర్చాలి. – శివ కుమార్, మద్నూర్

మిషన్ భగీరథ నీటిని అందిస్తాం

మిషన్ భగీరథ నీరు ఎక్కడ రావడం లేదో మా దృష్టికి తీసుకొస్తే సిబ్బందిని పంపి సమస్యను పరిష్కారిస్తాం. నీటి సమస్య ఉన్న ప్రాంతాల్లో పర్యటించి సమస్య లేకుండా చేస్తాం. ప్రజలు ఫిర్యాదులు చేయాలి.
– మహమూద్, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్, మద్నూర్

ఏ క్షణాన కూలుతుందో..?


దోమకొండలోని తహసీల్ కార్యాలయంలో గోడలకు ఏర్పడిన పగుళ్లు

దోమకొండ: ఏ నిమిషాన ఏమి జరుగునో ఎవరూహించెదరు.. అనే పాత పాట గుర్తుకొస్తుంది మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయం పరిస్థితి చూస్తే. అందులో పని చేసే సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. తహసీల్ కార్యాలయం ప్రస్తుతం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. ఇక్కడి కార్యాలయాన్ని భిక్కనూరు, మాచారెడ్డి, దోమకొండ మండలాలకు తాలుకా కేంద్రంగా ఉన్న సమయంలో నిర్మించారు. కార్యాలయ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరి పెచ్చులూడగా, ఐదేళ్ల క్రితం స్లాబ్ పైభాగంలో మరమ్మతులు చేశారు. కాని ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కార్యాలయంలోని గోడలకు పగుళ్లు ఏర్పడ్డాయి. కార్యాలయంలోని రికార్డు గది వర్షానికి పూర్తిగా తడిసింది. గదిలోకి వెళ్లడానికి కార్యాలయ సిబ్బంది భయపడుతున్నారు. తహసీల్దార్‌తో పాటు కార్యాలయ సిబ్బంది ప్రతిరోజు విధులకు హాజరువుతున్నా భయంగానే వారు తమ విధులు నిర్వహిస్తున్నారు. జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి కార్యాలయ భవనం మరమ్మతులు చేయించాలని వారు కోరుతున్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి



గాంధారి(ఎల్లారెడ్డి): విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠాలు బోధించాలని డీఐఈవో షేక్ సలాం అన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆన్‌లైన్ ఫిజిక్స్ పాఠాలను పరిశీలించారు. ఆన్‌లైన్ పాఠాలు అర్థమవుతున్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అధ్యాపకులు, విద్యార్థులు సమయ పాలన పాటించాలని సూచించారు. అధ్యాపకులు, విద్యార్థుల హాజరు రిజిష్టర్లను పరిశీలించారు. కాలేజీ ప్రిన్సిపాల్ గడ్డం గంగారాం, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఖాతాదారులు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



దోమకొండ: బ్యాంకు ఖాతాదారులు రుణాలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని కెనరా బ్యాంక్ డివిజనల్ మేనేజర్ ఆంటోని అన్నారు. దోమకొండ కెనరా బ్యాంక్ కార్యాలయంలో బ్యాంకు ఖాతాదారులకు రుణాలపై శుక్రవారం అవగాహన శుక్రవారం నిర్వహించి మాట్లాడారు. బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కెనెరా బ్యాంకు సీనియర్ మేనేజర్ ప్రసాద్, మేనేజర్ హిమబిందు, అసిస్టెంట్ మేనేజర్ ప్రశాంత్, మాజీ జెడ్పీటీసీ తిరుమల్ గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంకా తప్పని యూరియా ఇక్కట్లు


చిన్నమల్లారెడ్డిలో యూరియా కోసం కామారెడ్డి-రాజంపేట రోడ్డుపై రాస్తారోకో నిర్వహిస్తున్న రైతులు


పెద్దకొడప్‌గల్ సొసైటీ వద్ద పోలీస్ బందోబస్తు మధ్యలో యూరియా పంపిణీ చేస్తున్న సిబ్బంది


తాడ్వాయిలోని సొసైటీ వద్ద ..


ఎల్లారెడ్డి: గండిమాసానిపేటలో..

కామారెడ్డిరూరల్/తాడ్వాయి/పెద్దకొడప్‌గల్: జిల్లాలో రైతులకు యూరియా దొరక్క ఇంకా ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. పొద్దున్నే సొసైటీల పడిగాపులు కాస్తున్నారు. చెప్పులు లైన్లలో పెట్టి వేచి చూస్తున్నారు. కొన్నిచోట్ల రైతులకు ఒక్కో బస్తా యూరియా పంపిణీ చేస్తున్నారు. దొరకని రైతులు ఆందోళనకు దిగుతున్నారు. కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డిలో యూరియా కోసం రైతులు కామారెడ్డి–రాజంపేట రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. తాడ్వాయి, పెద్దకొడప్‌గల్ సొసైటీలలో పోలీసు బందోబస్తు మధ్య యూరియాను పంపిణీ చేశారు.

విద్యార్థులు దురలవాట్లకు దూరంగా ఉండాలి


మాట్లాడుతున్న ఎస్సై ఆంజనేయులు


హాజరైన విద్యార్థులు

గాంధారి(ఎల్లారెడ్డి): విద్యార్థులు దురలవాట్లకు దూరంగా ఉంటూ క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఎస్సై ఆంజనేయులు అన్నారు. స్థానిక ఏకలవ్య గురుకుల పాఠశాలలో శుక్రవారం పోలీసు కళాబృందం సభ్యులు కళాప్రదర్శన ఇచ్చారు. సైబర్ నేరాల నియంత్రణ, మాదక ద్రవ్యాలు– వాటి వాడకం వల్ల కలిగే నష్టాలు, బాల్య వివాహాలు– నివారణ, ఈవ్ టీజింగ్ తదితర విషయాలపై కళాప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. లైంగిక దాడులకు ఎవరైనా ప్రయత్నించినా పోలీసులకు, షీ టీమ్‌లకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

108లో ప్రసవం.. తల్లీబిడ్డా క్షేమం

పెద్దకొడప్‌గల్(జుక్కల్): కాటేపల్లి తండాకు చెందిన సరితకు పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 వాహనానికి సమాచారం అందించారు. వెంటనే పెద్దకొడప్‌గల్ 108 అంబులెన్స్ తండాకు చేరుకుని సరితను పిట్లం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిశీలించిన వైద్యులు రక్తం తక్కువగా ఉందని బాన్సువాడ ఆస్పత్రికి సిఫారసు చేశారు. బాన్సువాడకు తరలిస్తుండగా మార్గమధ్యలో రాంపూర్ వద్ద అంబులెన్స్‌లోనే సరిత ప్రసవించినట్లు ఈఎంటీ గంగారాం తెలిపారు. ఆడబిడ్డకు జన్మనిచ్చిందని తల్లీబిడ్డ ఇద్దరు క్షేమంగా ఉన్నారని తెలిపారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం



మాచారెడ్డి: క్రీడల్లో గెలుపోటములు సహజమని పాల్వంచ ఎంఈవో రాంమనోహర్ రావు అన్నారు. పాల్వంచ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన మండల స్థాయి క్రీడా పోటీల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మండలంలోని 10 పాఠశాలల నుంచి 380 మంది విద్యార్థులు ఖోఖో, వాలీబాల్, కబడ్డీ క్రీడలలో పోటీ పడ్డారు. అనంతరం గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. పాఠశాల హెచ్‌ఎం గోవర్ధన్ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్ మధుసూదన్ రెడ్డి, ఉపాధ్యాయులున్నారు.

యువకుల రక్తదానం

కామారెడ్డి అర్బన్: ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఓ మహిళకు యోగా గురువు నాయిని నివాస్ శుక్రవారం 14వ సారి బి– పాజిటివ్ రక్తాన్ని దానం చేశారు. అలాగే బీజేవైఎం నాయకులు మ్యాదరి రాకేష్ కామారెడ్డి ఇంద్రనగర్ కాలనీకి చెందిన రాజు అనే యువకుడికి అత్యవసర చికిత్స కోసం ఓ పాజిటివ్ రక్తం దానం చేశారు. రాకేష్, నివాస్‌లు ప్రతి మూడు నెలలకు ఒక సారి రక్తదానం చేయడం పట్ల రక్తదాతల సమూహం అధ్యక్షుడు జమీల్ హైమద్, రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ రాజన్న, జిల్లా సమన్వయకర్త బాలు అభినందించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచడమే లక్ష్యం



రామారెడ్డి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యలను పెంచడమే లక్ష్యంగా మద్దికుంట ప్రాథమిక పాఠశాలలో ప్రీ ప్రైమరీ సెషన్‌ను ప్రారంభిస్తున్నట్లు ఎంఈవో ఆనందరావు తెలిపారు. శుక్రవారం ఎంఈవో ఆనంద్ రావు మద్దికుంటలో ప్రీ ప్రైమరీ సెషన్‌ను ప్రారంభించి మాట్లాడారు. ప్రీ ప్రైమరీ సెక్షన్లో 4 ఏళ్ల నుంచి విద్యార్థులకు యూకేజీ విద్యనందిస్తామని, రాష్ట్రవ్యాప్తంగా 1000 ప్రీ ప్రైమరీ స్కూళ్లు ప్రారంభిస్తే మండలానికి ఒక ప్రీ ప్రైమరీ స్కూల్ మంజూరైందని పేర్కొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై కళాజాత



లింగంపేట(ఎల్లారెడ్డి): ముస్తాపూర్‌లో శుక్రవారం తెలంగాణ సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో కళాజాత ప్రదర్శన నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కళాకారులు పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు, ప్రభుత్వం చేపడుతున్న ఆరు గ్యారంటీలపై ఆటపాటలతో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాకారులు మహేందర్, రమేశ్‌రావు, నాగరాజు, లక్ష్మీనారాయణ, సవిత, విఠల్‌రెడ్డి, లత, రాము, కాశీరాం, పోశెట్టి, నరేష్, తిరుపతి, దివ్య తదితరులు పాల్గొన్నారు.

దామోదర్‌రెడ్డి ఎన్నికపై హర్షం


బీర్కూర్‌లో కేక్ కట్ చేస్తున్న ఉపాధ్యాయులు

బాన్సువాడ : పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడిగా దామోదర్‌రెడ్డి ఎన్నికడంపై బీర్కూర్ పీఆర్‌టీయూ ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. బీర్కూర్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం కేక్ కట్ చేసి తోటి ఉపాధ్యాయులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లక్క నరహరి మాట్లాడుతూ.. జిల్లాకు చెందిన దామోదర్‌రెడ్డి అంచలంచెలుగా ఎదిగి నేడు పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నిక కావడం హర్షణీయమని అన్నారు. ఉపాధ్యాయుల పక్షాన పోరాటాలు చేసి సమస్యలపై నిరంతరం కృషి చేస్తున్న దామోదర్‌రెడ్డి జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు సర్వ శ్రీనివాస్, రామకృష్ణ, గంగాధర్, పురుషోత్తం, రాధాకృష్ణ, గంగారెడ్డి, శ్రీనివాస్ తదితరులున్నారు.

ఐకేపీ ద్వారా ఇందిరమ్మ ఇళ్లకు రుణాలు



భిక్కనూరు: ఇందిరమ్మ ఇళ్లకు ఐకేపీ ద్వారా రుణాలను అందించనున్నట్లు ఐకేపీ డీపీఎం రాజయ్య తెలిపారు. ఆయన శుక్రవారం భిక్కనూరులో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని గుర్తుచేశారు. ఇళ్లు లేని వారందరికి ప్రభుత్వం ఈ పథకాన్ని వర్తింపజేస్తుందని.. మొదటి బిల్లు వచ్చే వరకు ఐకేపీ వారికి రుణాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉందన్నారు. మండలంలో ఇప్పటి వరకు 673 ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసిందని, ఇందులో 95 మంది సభ్యులకు రూ. కోటి 17 లక్షల 85 వేలు అందించినట్లు తెలిపారు. ప్రభుత్వం నుంచి రూ.5 లక్షలు మంజూరైన తర్వాత సభ్యులు తిరిగి రుణాన్ని చెల్లించాల్సి ఉంటుందన్నారు. ప్రతి మహిళా డ్వాక్రా సంఘంలో సభ్యురాళ్లుగా ఉండాలన్నారు. ఐకేపీ ఏపీఎం సాయిలు ఉన్నారు.

రైతులు కెపాసిటర్లు బిగించుకోవాలి



భిక్కనూరు: ప్రతి రైతు తమ వ్యవసాయ స్టార్టర్ బాక్సుల్లో తప్పనిసరిగా కెపాసిటర్లను బిగించుకోవాలని సీజీఆర్‌ఎఫ్ చైర్‌పర్సన్ నారాయణ అన్నారు. శుక్రవారం భిక్కనూరు రైతు వేదికలో భిక్కనూరు, రాజంపేట, బీబీపేట, దోమకొండ మండలాలకు సంబంధించి విద్యుత్ సమస్యల పరిష్కార మేళాను నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ.. ట్రాన్స్‌కోకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని సూచించారు. సమస్యలపై ఫిర్యాదులు చేయగా.. పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. ఎన్పీడీసీఎల్ సభ్యులు రామకృష్ణ, లకావత్ కిషన్, రాజాగౌడ్, ఏడీఈ సుదర్శన్‌రెడ్డి, ఏఈ సంకీర్త్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


బీబీపేటలో నిల్వ నీటిని పారబోస్తున్న ఆరోగ్య సిబ్బంది

బీబీపేట: ఇంటి పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో పూర్ణచంద్రోదయకుమార్ అన్నారు. శుక్రవారం ఫ్రైడే డ్రైడే సందర్భంగా మండల కేంద్రంలోని పలు కాలనీలను సందర్శించారు. ఈ సందర్భంగా పలు ఇళ్లలో ఎక్కువ రోజులు తొట్టిలో నిల్వ ఉన్న నీటిని గుర్తించి పారబోశారు. వర్షాకాలం సందర్భంగా ఎప్పటికప్పుడు నీటిని పట్టుకోవాలని నిల్వ ఉంచుకోరాదని సూచించారు. నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు వ్యాపించి రోగాల బారిన పడే అవకాశం ఉంటుందని అన్నారు. కార్యదర్శి రమేష్, ఆశ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): పోచారం, బెజుగంచెరువు తండా గ్రామ పంచాయతీలలో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు సూచనలు, సలహాలిచ్చారు. ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు భాస్కర్, అనిత, పల్లెదవాఖానా డాక్టర్ అజయ్, హెల్త్ సూపర్‌వైజర్ మణెమ్మ, ఏఎన్‌ఎం సంధ్యారాణి, అంగన్‌వాడి టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

హన్మాజీపేట్‌లో..

బాన్సువాడ రూరల్: హన్మాజీపేట్‌లో శుక్రవారం పారిశుద్ధ్య పనులు చేయించినట్లు జీపీ కార్యదర్శి రాజేష్ తెలిపారు. కాలనీల్లోని డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగింపజేశామన్నారు. ట్రాక్టర్ ద్వారా డంపింగ్‌యార్డుకు తరలించామన్నారు. గ్రామస్తులు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని ఆయన కోరారు. దోమలు వృద్ధి చెందకుండా నిల్వనీటిని ప్రతి వారం పారబోసి కొత్తనీటిని నింపుకోవాలన్నారు.

విధుల్లోకి గ్రామ పాలనాధికారులు

ఎల్లారెడ్డి/తాడ్వాయి/గాంధారి/పెద్దకొడప్‌గల్: ఎల్లారెడ్డి మండలానికి 24 మంది గ్రామ పాలనాధికారులు(జీపీవో), తాడ్వాయికి 13 మంది, గాంధారికి 25 మంది, పెద్దకొడప్‌గల్‌కు 10 మంది జీపీవోలు వచ్చినట్లు ఆయా మండలాల తహసీల్దార్లు ప్రేమ్‌కుమార్, శ్వేత, లక్ష్మణ్(డీటీ), ఇతర అధికారులు శుక్రవారం తెలిపారు. ఇటీవల పలు శాఖలలో పని చేసిన అధికారులను ప్రభుత్వం రాత పరీక్ష ద్వారా జీపీవోలుగా ఎంపిక చేయడంతో వారు వచ్చి రిపోర్టు చేసినట్లు తెలిపారు. ఇంకా కొందరు రిపోర్టు చేయాల్సి ఉంది.

క్లుప్తంగా

తిమ్మాపూర్ చెరువు పరిశీలన



ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని తిమ్మాపూర్ పెద్ద చెరువును నీటిపారుదల శాఖ డీఈ వెంకటేశ్వర్లు శుక్రవారం పరిశీలించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చెరువు కట్ట తెగిపోవడంతో నీరు ఖాళీ అయింది. దీంతో చెరువు కట్ట తాత్కాలిక పునరుద్ధరణకు రూ.9.98 లక్షలు మంజూరు కావడంతో శనివారం నుంచి తాత్కాలిక కట్ట పనులు ప్రారంభించనున్నట్లు డీఈ తెలిపారు.

బాల్యవివాహాల నిరోధానికి ప్రతిజ్ఞ



భిక్కనూరు: బాల్యవివాహాల నిరోధానికి కృషి చేస్తామంటూ భిక్కనూరు శ్రీసిద్దరామేశ్వరాలయంలో సాధన ఎన్జీవో సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. బాల్యవివాహాల వల్ల కలిగే ఇబ్బందుల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయవాది గజ్జెల భిక్షపతి, ఆలయ ఈవో శ్రీధర్, అర్చకులు రామగిరిశర్మ, సిద్దగిరిశర్మ, రాజేశ్వరశర్మ, సిద్దేశ్వర్, సిబ్బంది, సంస్థ ప్రతినిధులు అనూష, జ్యోతి, సంధ్యారాణి, సంతోష్ పాల్గొన్నారు.

అధ్యాపకులకు శిక్షణ



భిక్కనూరు: మండలంలోని పెద్దమల్లారెడ్డి బాలుర ఉన్నత పాఠశాలలో భిక్కనూరు, బీబీపేట, దోమకొండ మండలాల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు నూతన ఆవిష్కరణలపై శుక్రవారం అవగాహన కల్పించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా జరుగుతున్న ఆవిష్కరణలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో రిసోర్సు పర్సన్ స్రవంతి, సీఆర్‌పీ ఈశ్వర్, హెచ్‌ఎం ప్రసూన పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను బీసీ-ఏలోకి చేర్చాలి



ఎల్లారెడ్డి: ముదిరాజ్‌లను బీసీ-ఏలోకి చేర్చాలని కోరుతూ శుక్రవారం ఆర్డీవో పార్థసింహారెడ్డికి ముదిరాజ్ సంఘం నాయకులు వినతిపత్రం అందించారు. ముదిరాజ్‌లను ప్రభుత్వం బీసీ–ఏలోకి చేర్చేలా చర్యలను తీసుకోవాలని వారు కోరారు. సంఘం నాయకులు ప్యాలాల రాములు, గోనె శ్రీకాంత్, బాల కిషన్, ఎల్లయ్య తదితరులున్నారు.

దేవాయిపల్లి- బ్రాహ్మణపల్లి రోడ్డు పరిశీలన



సాక్షి ఎఫెక్ట్..

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని దేవాయిపల్లి–బ్రాహ్మణపల్లి మార్గంలో ఇటీవల కురిసిన వర్షాలకు అధ్వానంగా తయారైన రోడ్డును శుక్రవారం మండల ప్రత్యేక అధికారి శివకుమార్, ఎంపీడీవో సయ్యద్ సాజీద్‌అలీ పరిశీలించారు. ఈ నెల 11న సాక్షిలో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. ఎక్కడెక్కడ రోడ్డు ధ్వంసమైందో వివరాలు సేకరించారు. అనంతరం జిల్లా ఉన్నత అధికారులకు ప్రతిపాదనలు పంపించారు. ఏఈ కల్పన, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి ఉన్నారు.

పాఠశాలను సందర్శించిన యునిసెఫ్ బృందం



భిక్కనూరు: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలను యునిసెఫ్ బృందం శుక్రవారం సందర్శించింది. ఈ సందర్భంగా అటల్ టింకరింగ్ ల్యాబ్ పనితీరు, ఉపాధ్యాయుల విద్యార్థుల వినియోగంపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థుల ప్రతిభను గుర్తించి అభినందించారు. యునిసెఫ్ కన్సల్టెంట్ ఉదయ, కేస్ స్టడీ బృందం సభ్యులు ధావన్, సుస్మిత, విజ్ఞాన్ ఆశ్రమ్ ప్రతినిధి పవన్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

పాఠశాలకు రివార్డు చెక్కు అందజేత



రాజంపేట: ఇటీవల రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన రాజంపేట మండలంల పొందుర్తి పాఠశాలకు చెందిన ముదాం స్వామిని గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ముదాం స్వామి తనకు రాష్ట్ర ప్రభుత్వం అందించిన క్యాష్ రివార్డును పాఠశాలకు విరాళంగా అందించాడు. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు బాలయ్య, రాజేశ్వర్‌రెడ్డి, ఉమాపతి, బాలరాజ్‌గౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



బాన్సువాడ రూరల్: ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని బాన్సువాడ మండల ప్రత్యేకాధికారి, కామారెడ్డి డీఈవో రాజు అన్నారు. శుక్రవారం ఆయన కోనాపూర్‌లో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాల పురోగతిని పరిశీలించారు. లబ్ధిదారులు కట్టుకుంటున్న ఇళ్లకు వెళ్లి వీలైనంత త్వరగా నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు. ఇంకా పనులు ప్రారంభించని వారు వెంటనే ముగ్గుపోసి ప్రారంభించాలన్నారు. పంచాయతీ కార్యదర్శి భరత్, గ్రామస్తులు ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరం

భిక్కనూరు: తిప్పాపూర్‌లో మెడిసిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 326 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కొండ సిద్ధరాములు, వైద్యులు ఉదయ్‌కిరణ్, తేజ, మీనా, సహస్య, మార్కెటింగ్ ఇన్‌చార్జిలు నాగార్జున, కుమారస్వామి, సునీల్, గంగ పాల్గొన్నారు.

జ్యోతీబాపూలే పాఠశాలలో..

బాన్సువాడ: బీర్కూర్ మహాత్మా జ్యోతి బాపూలే పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేసి అవసరమయ్యే మందులను ఉచితంగా అందజేశారు. విద్యార్థులు భోజనం చేసే సమయంలో చేతులను శుభ్రంగా కడుక్కోవాలని వైద్యులు సూచించారు. వైద్యులు నాగ గిరీష్, రవీందర్, మౌనిక, ఏఎన్‌ఎం పద్మ, సునీత తదితరులున్నారు.